నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక : 162 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 9-9-2025 పేజీలు -8 | వెలః రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

విద్య,వైద్యములను వైవిద్యభరితంగ
పేదవారిపట్ల పెన్నిదోలె
సేవచేయుటకును సేనవోలె మనము
కలిసినడవవలెను కాదననక

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

# నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక



## ఎన్డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్..ఇండియా అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి

- ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం 5 వరకు జరుగనున్న పోలింగ్
- సాయంత్రి 6 నుంచి ఓట్ల లెక్కింపు.. వెంటనే ఫలితం ప్రకటన



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి మంగళవారం ఎన్నిక జరుగనుంది. ఈ మేరకు ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటు ఉభయసభల సభ్యులుగా ఉన్నవారు మంగళవారం జరిగే ఎన్నికలో ఓటేస్తారు. ఈ ఎన్నకలను తెలంగాణకు చెందిన బిఆర్ఎస్ బహిష్కరించింది. అలాగే ఒడిషాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. పాలక ఎన్‌డీఏ తరపున మహారాష్ట్ర -మిగతా 2 లో



# టార్గెట్ 100 డేస్

- వందరోజుల్లో మేడారం అభివృద్ధి పనులు
- బాసర, మేడారం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్,సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): మేడారం, బాసర ఆలయాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని, ఈ వారంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని అధికారులకు చెప్పారు. జాతరకల్లా సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను -మిగతా 2 లో



## ఆధార్‌ను గుర్తింపు కార్డుగా
# అంగీకరించండి..

- ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం..!

న్యూఢిల్లీ, బిహార్ ఓటర్ల జాబితా ఇంటెన్సివ్ రివిజన్ కేసులో సుప్రీంకోర్టు ఆధార్ చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు అని స్పష్టం చేసింది. అయితే, అది పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని తేల్చి చెప్పింది. బీహార్ ఓటర్ల జాబితా ఇంటెన్సివ్ రివిజన్ కేసుపై విచారణ సందర్భంగా సోమవారం.. ఓటర్లు తమ పేరును ఓటరు జాబితాలో చేర్చేందుకు ఆధార్ కార్డును 12వ పత్రంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే 11 పత్రాల జాబితాను విడుదల చేసింది. గతంలో జారీ చేసిన పత్రాల జాబితాలో ఆధార్ కార్డును మాత్రం చేర్చలేదు.తాజాగా సుప్రీంకోర్టు ఆధార్ కార్డును 12వ పత్రంగా అంగీకరించాలని ఆదేశించింది. ఆధార్ కార్డును ఆమోదించేందుకు వీలుగా అధికారులకు సూచనలు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి సూచించింది. అయితే, ఆధార్ కార్డును పౌరసత్వ రుజువుగా పరిగణించలేమని సుప్రీంకోర్టు క్లారిటీ ఇచ్చింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి సుప్రీం -మిగతా 2 లో




## గోదావరితో హైదరాబాద్
# నీటి గోస తీరుస్తాం

**ఎల్లంపల్లి శ్రీపాద నుంచి నీటిని తరలిస్తాం**

- ఇది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కానేకాదు
- మూసీ ప్రక్షాళన చేపట్టి తీరుతాం
- మూసీ ప్రక్షాళనతో నల్లగొండకు ఊపిరి
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్లను నిర్మిస్తాం
- గోదావరి తాగునీటి సరఫరా పథకం శంకుస్థాపనలో సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకం తీసుకొచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వరద నియంత్రణ కోసమే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నిర్మించారని అన్నారు. తాగునీటి సమస్యలు పరిష్కరించడానికే పీజేఆర్ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా.. ఉస్మాన్‌సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో గోదావరి ఫేజ్ 2, 3 పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.గోదావరి నదీ జలాలను -మిగతా 2 లో



# భారత్‌లోకి టిక్ టాక్ రీఎంట్రీ..?

- స్పష్టతనిచ్చిన కేంద్ర మంత్రి.. ఇంతకీ ఏం చెప్పారంటే..?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): చైనాకు చెందిన ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ సేవలు భారత్‌లో మళ్లీ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రచారంపై కేంద్రం తాజాగా స్పందించింది. టిక్‌టాక్ రీఎంట్రీ వార్తలను తోసిపుచ్చింది.ఈ మేరకు టిక్‌టాక్‌పై నిషేధాన్ని ఎత్తివేసే ప్రణాళిక పరిశీలనలో లేదని కేంద్ర ఐటీ, సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. మనీకంట్రోల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఈ విషయంపై ప్రభుత్వంలో ఎలాంటి చర్చలూ జరగలేదని వెల్లడించారు. -మిగతా 2 లో

## పార్టీ నిర్ణయం మేరకే
# కవిత సస్పెన్షన్

- అందరితో చర్చించిన తరవాతే కేసీఆర్ నిర్ణయం
- కాళేశ్వరం నీరు వాడుకుంటు బద్నాం చేస్తారా
- మీడియా సమావేశంలో కేటీఆర్ విమర్శలు




హైదరాబాద్, మాజీ ఎమ్మెల్సీ కవితను పార్టీ బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం పార్టీ అధినేత కెసిఆర్ నిర్ణయమని వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. అందరు చర్చించి తీసుకున్న నిర్ణయమని అన్నారు. సస్పెన్షన్ చేసిన తర్వాత కవిత తన ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రధాన సభ్యత్వానికి కూడా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై కవిత సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తొలిసారిగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీలో చర్చించిన తర్వాతే పార్టీ అధినేత కెసిఆర్ ఆ నిర్ణయం తీసుకున్నారని కెటిఆర్ స్పష్టం చేశారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత కవిత ప్రెస్‌మీట్ పెట్టి హరీశ్‌రావు, సంతోష్‌లను టార్గెట్ చేస్తూ.. ఆరోపణలు చేశారు. హరీశ్, సంతోష్‌లు పక్కన ఉంటారు కానీ తెలంగాణ గురించి, కెటిఆర్ గురించి ఆలోచించే వ్యక్తులు కాదని కెటిఆర్‌కు సూచించారు. వాళ్లను పక్కనపెడితే పార్టీ బతుకుతుందని, తన తండ్రి పేరు నిలబడుతుందని ఆమె అన్నారు. అయితే తాజాగా తెలంగాణ భవన్‌లో జరిగిన -మిగతా 2 లో

## ఆర్థిక సంక్షోభం సృష్టించిన
# ఘనుడు కేసీఆర్

**పాలన పరంగా రాష్ట్రాన్ని నాశనం చేసిన బీఆర్ఎస్**

- మేడిగడ్డ కుంగిందని చెబితే ఎదురుదాడి
- ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చరిత్రలో నిలుస్తుంది
- రాహుల్‌ను ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరు కృషి
- టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించారని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై భట్టి విక్రమార్క మరోసారి నిప్పులు చెరిగారు. పాలన పరంగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాశనం చేసిందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మేడిగడ్డ అంశంపై తాము మాట్లాడితే.. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని తెలిపారు. మేడిగడ్డ కుంగిందని వాస్తవాలు చెప్పిన కాంగ్రెస్ -మిగతా 2 లో



## సోషల్ మీడియా బ్యాన్‌పై
# నేపాల్‌లో ఆందోళనలు..

- ఎనిమిది మంది మృతి..
- 100 మందికిపైగా గాయాలు

2 లో

# 21 నుంచి దసరా సెలవులు




హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లకు దసరా సెలవులను ప్రకటించింది. దసరా పండుగ నేపథ్యంలో సెప్టెంబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ పాఠశాలలకు సెలవులు ఇచ్చింది. అదే విధంగా జూనియర్ కాలేజీలకు సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ సెలవులు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

## బీసీ రిజర్వేషన్లపై
# ముందే చెప్పాం

**బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు**



హైదరాబాద్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్): బిసి రిజర్వేషన్లపై లీగల్ సమస్యలు వస్తాయని ముందే చెప్పామని బిజెపి అధ్యక్షుడు రాంచందర్ తెలిపారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. న్యాయ నిపుణులను ముందు సంప్రదించారా? అని రిజర్వేషన్ల విషయంలో బిజెపి ఎక్కడ అడ్డుపడింది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చేయలేక తమపై నెపం వేయవద్దని -మిగతా 2 లో

# టార్గెట్ 100 డేస్

(మొదటి తరువాయి)

సీఎంకు అధికారులు వివరించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సీఎం పరిశీలించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ప్రవేశం, బయటకు వెళ్లే దారి, పార్కింగ్ తదితర ఏర్పాట్లు- ఉండాలి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలి. బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధిలో స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సీఎం దిశానిర్దేశంచేశారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించండి..

(మొదటి తరువాయి)

భారీ ఉపశమనం ఇచ్చింది. ఆధార్ కార్డు చెల్లుబాటును తనిఖీ చేసేందుకు ఎన్నికల సంఘానికి పూర్తి అధికారం ఉంటుందని తెలిపింది. ఆధార్ కార్డు చూపించి ఓటర్ల జాబితాలో చేర్చాలని ఆర్జేడీ పార్టీతో పాటు పలువురు డిమాండ్ చేశారు. ఆయా పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. బూత్ లెవల్ అధికారులు ఆధార్ కార్డులను అంగీకరించడం లేదని ఆర్జేడీ తరఫున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులకు సూచనలు జారీ చేయలేదని సిబల్ తెలిపారు. ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది హాజరయ్యారు. ఆధార్ కార్డును పౌరసత్వ రుజువుగా అంగీకరించలేమంటూ వాదనలు వినిపించారు. పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం తప్ప.. ఎన్నికల కమిషన్ జాబితా చేసిన 11 పత్రాలను కూడా పౌరసత్వ రుజువుగా పరిగణించబోమని జస్టిస్ బాగ్చి స్పష్టం చేశారు.

# భారత్‌లోకి టిక్ టాక్ రీఎంట్రీ..?

(మొదటి తరువాయి)

భారత్‌లో టిక్‌టాక్‌పై విధించిన నిషేధం ఎత్తివేతకు సంబంధించిన ఎటువంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేశారు. భారతీయ, చైనా సైనిక బలగాల మధ్య గల్వాన్ ఘర్షణ తర్వాత భద్రతా కారణాలు చూపుతూ భారత ప్రభుత్వం 2020లో టిక్‌టాక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. టిక్ టాక్‌తోపాటు వందలాది చైనీస్ గేమింగ్ యాప్‌లను భారత ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత కూడా భారత్‌లో ఏదోవిధంగా కొనసాగేందుకు శాయశక్తులా ప్రయత్నించిన టిక్ టాక్ కంపెనీ ఎట్టకేలకు 2023 ఫిబ్రవరి 28న మూతపడింది. అప్పటి నుంచి భారత్‌లో అందుబాటులో లేదు. అయితే, ట్రంప్ సుంకాల మోతతో అమెరికా-భారత్ మధ్య కాస్త ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించినప్పటి నుంచి భారత్, చైనా మధ్య సంబంధాలలో పురోగతి కనిపిస్తోంది. భారత్‌కు ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాలను తవ్వే మిషన్ల ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు చైనా ఇటీవలే ప్రకటించింది. ఆ తర్వాత టియాంజిన్‌లో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు జరిగిన షాంఘై సహకార సంస్థల(ఎస్‌సీఓ) సదస్సుకు ప్రధాని మోదీ హాజరైన విషయం తెలిసిందే. ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ పరిణామాలతో మళ్లీ భారత్‌లోకి అడుగుపెట్టబోతోందంటూ వార్తలు పుట్టుకొచ్చాయి. దీనిపై ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే క్లారిటీ ఇచ్చాయి కూడా. ఇప్పుడు ఐటీ, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా స్పష్టతనిచ్చారు.

# పార్టీ నిర్ణయంమేరకే కవిత సస్పెన్షన్

(మొదటి తరువాయి)

మీడియా సమావేశంలో కెటిఆర్‌ను కవిత గురించి ప్రశ్నించారు. దీనికి ఆయన కవిత చేసిన వ్యాఖ్యలపై పార్టీలో చర్చించిన తర్వాత అధినేత నిర్ణయం తీసుకున్నారని.. ఇంకా ఆ విషయంలో స్పందించడానికి ఏమీ లేదని చెప్పారు. దీంతో పాటు- ఉప రాష్ట్రపతి ఎన్నికలకు కూడా తమ పార్టీ దూరంగా ఉంటుందని కెటిఆర్ ఈ సందర్భంగా వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టే సిబిఐకి కాళేశ్వరం కేసు అప్పగించారని కెటిఆర్ తెలిపారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఏమీ తేల్చలేదని కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. కాళేశ్వరం నీటిని వాడుకుంటూ ప్రాజెక్టును బద్నాం చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేసినందుకు ప్రజలకు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని అన్నారు. కొండపోచమ్మ నుంచి గ్రావిటీ- ద్వారానే గండిపేటకు నీరు వస్తుందని, మూసి ప్రాజెక్టులో విడతల వారి దోపిడి జరుగుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్‌ఎంసి ఎన్నికల తర్వాత ఉచిత మంచినీటి పథకాన్ని ఎత్తి వేస్తారని ఎద్దేవా చేశారు. యూరియా ఇచ్చిన వారికి ఓట్లు- వేస్తామని చెప్పామని, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల్లో ఇద్దరు మంచివారని కెటిఆర్ తెలియజేశారు. కానీ వారు కాంగ్రెస్ బిజెపి తరపున పోటీ- చేస్తున్నారని, బిజెపి కాంగ్రెస్ రైతులను వేధింపులకు గురిచేస్తున్నాయని అన్నారు. నోటా లేదు కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ లో చేరానని కడియం శ్రీహరి కూడా చెప్పారని.. ఇంకా విచారణ ఏముంది? అని వారితో సిఎం సమావేశం పెట్టడం ద్వారా ఏం సందేశం ఇస్తున్నారని కెటిఆర్ ప్రశ్నించారు.

# బీసీ రిజర్వేషన్లపై ముందే చెప్పాం

(మొదటి తరువాయి)

దుయ్యబట్టారు. రాష్ట్రంలో బిజెపికి అధికారం ఇస్తే బిసిల 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ కు చిత్త శుద్ధి లేకుండా తమపై నిందలు వేస్తున్నారని రాంచందర్ ధ్వజమెత్తారు. బీసీ రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో ద్రోహం చేసిందని ఆరోపించారు. తెలంగాణ బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తుందని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా కామారెడ్డి గడ్డ మీద మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.3వేల కోట్లు- ఆగిపోయాయని చెప్పారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు రాజ్‌నాథ్ సింగ్ వస్తున్నారని, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

# నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

(మొదటి తరువాయి)

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67), విపక్ష 'ఇండీ' కూటమి నుంచి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి (79) పోటీచేస్తున్నారు.

అన్ని పార్టీల ఎంపీలూ ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. ఈ ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. పార్లమెంటు- భవనంలోని వసుధలో ఎఫ్-101 గదిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్లు- లెక్కించి ఫలితం ప్రకటిస్తారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల మద్దతు కోరిన సుదర్శన్‌రెడ్డి కూడా దేశ రాజధానికి వచ్చేశారు. తాను ఏ పార్టీ తరఫునా పోటీ- చేయడం లేదని, రాజకీయాలకతీతంగా తనకు ఓటు వేయాలని ఆయన ఉభయ సభల ఎంపీలకు లేఖ రాశారు. తమ ఎంపీలు ఓట్లు సక్రమంగా వేసేందుకు వీలు కల్పిస్తూ రెండు కూటములూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేశాయి. బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ అధినాయకత్వం తలపెట్టిన రెండ్రోజుల వర్క్‌షాప్ ఆదివారం ఢిల్లీలో మొదలైంది. ప్రధాని మోదీ దీనికి హాజరయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఎన్‌డీఏ ఎంపీలతో కలిసికట్టుగా వ్యూహరచనకు దిగారు. ఇక విపక్ష ఎంపీలకు కాంగ్రెస్ సోమవారం మధ్యాహ్నం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో మాక్‌పోల్ నిర్వహించి.. ఓటు ఎలా వేయాలో వివరించారు. ఉభయసభల్లో ఎన్‌డీఏకే సంఖ్యాబలం ఉంది. రెండు సభల్లో మొత్తం 788 మంది సభ్యులకు గాను ప్రస్తుతం 781 మందికి గాను లోక్‌సభలో 542, రాజ్యసభలో 239 మంది ఉన్నారు. ఎన్‌డీఏకి 425 మంది, ఇండీ కూటమికి 311 మంది, ఇతర ప్రతిపక్షాలకు 45 మంది సభ్యులున్నారు. ఇతర ప్రతిపక్షాల్లో వైసీపీ (11).. ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. బీజేడీ (7) మద్దతు కోసం ఆ పార్టీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేశారు. సరైన సమయంలో తమ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని బీఆర్ఎస్ ఎంపీ కె.సురేశ్‌రెడ్డి మీడియాకు తెలిపారు. అయితే ఈ రెండు పార్టీలు తాజాగా ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. బిఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. శిరోమణి అకాలీదళ్ వంటి ఏకసభ్య పార్టీలు, స్వతంత్రులు ఎటు- మొగ్గుతారో చూడాల్సి ఉంది. రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగ నున్నందున.. అధికార కూటమి నుంచి సుదర్శన్‌రెడ్డికి క్రాస్‌ఓటింగ్ జరుగుతుందని కాంగ్రెస్ ఆశాభావంతో ఉంది. అటు బీజేపీ కూడా.. తమిళనాడు ఎంపీల్లో కొందరు తమ రాష్ట్రానికే చెందిన రాధాకృష్ణన్ వైపు మొగ్గుచూపుతారని అంచనా వేస్తోంది. దళిత, ఆదివాసీ ఎంపీలందరూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికే మద్దతివ్వాలని తమిళనాడుకు చెందిన వీసీకే ఎంపీ తిరుమావళవన్ ఒక లేఖలో పిలుపిచ్చారు. ఆయన పార్టీకి లోక్‌సభలో ఇద్దరు సభ్యులున్నారు. 2002 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భైరాన్‌సింగ్ షెకావత్‌కు 454 ఓట్లు- రాగా.. ఆయనపై బరిలోకి దిగిన కాంగ్రెస్ సీనియర్ నేత సుశీల్‌కుమార్ షిండేకు 302 ఓట్లు- వచ్చాయి. వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనడు 516 ఓట్లు- సాధించగా.. ప్రత్యర్థి గోపాలకృష్ణ గాంధీకి కేవలం 244 ఓట్లు- వచ్చాయి. 2022 ఎన్నికల్లో జగదీప్ ధన్‌ఖడ్‌కు 520 ఓట్లు- వచ్చాయి. విపక్షాల ఐక్య అభ్యర్థి మార్గరెట్ ఆల్వా కేవలం 182 ఓట్లు- సాధించారు. ఈసారి ఎన్‌డీఏ అభ్యర్థికి 500 ఓట్లలోపే వచ్చే అవకాశాలున్నాయి. ప్రతిపక్షాలు తమకు ఉన్న మొత్తం 324 ఓట్లు- సాధించినప్పటికీ.. అన్ని ఎక్కువ ఓట్లు- పొంది ఓడిపోవడం ఇదే మొదటిసారి అవుతుంది. చెల్లని ఓట్లపై రెండు కూటముల్లో ఆందోళన నెలకొంది. 2022లో 15 మంది ఎంపీల ఓట్లు- చెల్లకపోవడమే దీనికి కారణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంపీలకు కూడా ఓటు- వేయడం రాకపోతే ఎలాగని ఉభయ కూటముల నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఎంపీలు తమ ఓటింగ్ ప్రాధాన్యాలను అక్షరాల్లో కాకుండా అంకెల ద్వారా సూచించాలని.. కానీ కొందరు అది గ్రహించలేక పోతున్నారని వారు చెబుతున్నారు. అంతేగాక.. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్దిష్ట పెన్నులతోనే వారు తమ ప్రాధాన్యాలను తెలుపవలసి ఉంటుంది. మరే ఇతర పెన్నులు వాడినా ఓటు చెల్లదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రతి 15 మంది పార్టీ ఎంపీలకు ఒక సమన్వయకర్తను నియమించింది. ప్రతిపక్ష సభ్యులను సమన్వయపరిచేందుకు ప్రత్యేక బృందాలను మోహరించింది.

# గోదావరితో హైదరాబాద్ నీటి గోస తీరుస్తాం

(మొదటి తరువాయి)

మూసీ నది, ఈసా నదిలో సమ్మేళనం చేసి నగర ప్రజల దాహార్తిని తీర్చుతాం. హైద్రాబాద్ నగరంకు ప్రపంచ దేశాల్లో గొప్ప పేరుంది. 1908లో నగర ప్రమాదాన్ని నివారించడానికి నిజాం సర్కార్ ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించారు. ప్రపంచంలోనే గొప్ప ఇంజినీర్లతో నిజాం సర్కార్ ఈ ప్రాజెక్టులు కట్టింది. దూరదృష్టితో ఆలోచించి ఈ ప్రాజెక్టులు కట్టడంతో నగర దాహం తీరుతోంది. నగరంలో జనాభా పెరుగుతోంది, ఉద్యోగాల కోసం హైదరాబాద్ వస్తున్నారు. నగర జనాభా కోటిన్నరకు చేరింది. పీజేఆర్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఖాళీ కుండలతో అసెంబ్లీ ముందు ధర్నాలు చేసి.. మంజీరా, కృష్ణా జలాలను హైదరాబాద్ తరలించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు శ్రీపాద ఎల్లంపల్లి నీటిని తరలించడానికి శంకుస్థాపన చేస్తే 2014 నుంచి నగరానికి వచ్చాయి' అని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు చెప్పారని అన్నారు. సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకెళ్తున్నామన్నారు. తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎవరు అడ్డం వచ్చినా ఈ పథకం పూర్తి చేస్తాం. నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. ఈ పథకం ద్వారా హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమే కాకుండా, నల్గొండ ఫ్లోరైడ్ సమస్య తీరుతుంది. భారత రాష్ట్ర సమితి వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగింది. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలి. త్వరలో మహారాష్ట్రకు వెళ్లి అక్కడి సీఎంను కలుస్తామని సీఎం అన్నారు. నల్గొండ ప్రజల కోసమే మూసీ నదిని ప్రక్షాళన చేస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సబర్మతి, యమునా, గంగా నది ప్రక్షాళన జరగొచ్చు కానీ.. మూసీ నది ప్రక్షాళన జరగొద్దా? అని సీఎం ప్రశ్నించారు. రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో పనులు చేయనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. నల్లగొండ జిల్లాలో మూసీ నది కాలుష్యానికి మారు పేరుగా మారింది. ఆ నీరు త్రాగి పశువుల ప్రాణాలే కాదు మనుషుల ప్రాణాలు కూడా పోతున్నాయి. మూసీ నది నీటి వల్ల ఆడబిడ్డలకు పురిటి సమస్యలకు కారణం అవుతుంది. నల్లగొండ జిల్లాలో పర్యటించినప్పుడు అక్కడ పరిస్థితి చూసి మూసీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నా. హైదరాబాద్ నగరంలో డ్రైనేజీల నీరు, కంపెనీల కాలుష్యం మూసీలో కలవకుండా ఈ నిర్ణయం తీసుకున్నాను. ఆ నీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు పెట్టడం జరిగిందన్నారు. గేట్ వే ఆఫ్ ఢిల్లీ, గేట్ వే ఆఫ్ ముంబై ఉంది. ఇప్పుడు గేట్ వే ఆఫ్ హైదరాబాద్ కూడా ఉంటది. హైదరాబాద్ అభివృద్ధికి అందరూ కలిసి రావాలి. అందుకు మీ అందరి సహకారం కావాలి. రాబోయే రోజుల్లో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చేద్దాం. ఎవరు అడ్డుకున్నా మన ప్రభుత్వం తిప్పి కొడుతుందన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యం, పేద్దోళ్ల రాజ్యం. పేదోళ్లకు న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాను. 2014 నుంచి బీఆర్ఎస్ ఒక్క చుక్క నగరానికి తీసుకు రావాలనే ఆలోచన చేయలేదని, తాము మరలా అధికారంలోకి వచ్చాక గోదావరి నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు చేసి ముందుకెళ్తున్నామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి 2 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అప్పట్లో ఐటీ- మంత్రిగా ఉన్న వ్యక్తి నగరానికి వచ్చే నీటిని నెత్తి మీద చల్లుకున్నాడు. ఆయన నీళ్ళు చల్లుకున్నంత మాత్రాన చేసిన పాపాలు ఎక్కడికి పోవు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే

వివిధ ప్రాజెక్టుల నుంచి నగరానికి నీళ్లు తీసుకువచ్చారు. 2014 నుంచి ఒక్క చుక్క నగరానికి తీసుకురావాలనే ఆలోచన చేయలేదు. తిరిగి మేము అధికారంలోకి వచ్చాక గోదావరి నీళ్ళని తీసుకురావడానికి ప్రణాళికలు తయారు చేసి ముందుకెళ్తున్నాం. ఒక వ్యక్తి తాడిచెట్టు- లాగా పెరిగాడు కానీ ఏమి లాభం లేదు. గోదావరి జలాలు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అంటున్నాడు. కానీ వాళ్ళు కట్టిన కాళేశ్వరం.. కూలేశ్వరం అయింది. శ్రీపాద ఎల్లంపల్లి మీ తాత ముత్తాతలు కట్టలేదు. గోదావరి జలాలు నగరానికి వస్తున్నాయంటే శ్రీపాద ఎల్లంపల్లి మూలం. కాకా సూచన మేరకు ప్రాణహిత చేవెళ్లకు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుగా అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి నామకరణం చేశారు. చేవెళ్లలో రాజశేఖర్ రెడ్డి వేసిన శిలాఫలకం లేదా. కానీ దాన్ని ఆపి రంగారెడ్డి జిల్లాకు అన్యాయం చేశారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు దగ్గర 152 మీటర్ల ఎత్తులో కడతాం అని అడిగాం. 149 మీటర్లకు ఒప్పుకున్నారు. గోదావరి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి 2 లక్షల ఎకరాలకు నీళ్లిస్తాం. చేవెళ్ల, పరిగి, వికారాబాద్ కు నీళ్ళు తీసుకువస్తామని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

# ఆర్థిక సంక్షోభం సృష్టించిన ఘనుడు కేసీఆర్

(మొదటి తరువాయి)

పార్టీని బీఆర్ఎస్ నేతలు తప్పుపడుతున్నారన్నారు. హరీష్ రావు, సంతోష్ రావులు కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో దోచుకోవడం వల్లే.. కేసీఆర్ రెండో సారి తన కేబినెట్‌లో హరీశ్ రావును అవకాశం ఇవ్వలేదని ఆయన వివరించారు. తెలంగాణలో పాలనతోపాటు- ఆర్థిక పరంగా గాడిన పెడుతున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి రాగానే రుణ మాఫీ చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- రైతు భరోసా కింద ఇచ్చామన్నారు. దేశంలోనే రైతులకు ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ చేసిందని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. దాదాపు రూ. లక్ష కోట్లు- సంక్షేమ కోసం ఖర్చు చేసిందన్నారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ కుల గణన చేస్తామన్నారని..ఆ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేసి చూపించామని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇక స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం బిల్లులు తీసుకొని వచ్చామన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రిజర్వేషన్లకు ముకుతాడు వేసిందని విమర్శించారు. ఎల్లంపల్లి, నెట్టెంపాడు ,శ్రీశైలం, నాగార్జున సాగర్, దేవాదుల ప్రాజెక్టులు మనమే నిర్మించామని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. అందరం కలిసికట్టు-గా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒకటి తప్పకుండా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ అజేయంగా ఉండేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు- కేబినెట్ అంతా అండగా ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించేందుకు, సవాళ్లను ఎదుర్కొని న్యాయం చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని భారత రాష్ట్ర సమితి పెట్టింది. 42 శాతం రిజర్వేషన్ బిల్లును భాజపా రాష్ట్రపతి దగ్గర ఆపింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి, భాజపా కుట్ర దాగి ఉందని భట్టి విమర్శించారు.

# సోషల్ మీడియా బ్యాన్‌పై నేపాల్‌లో ఆందోళనలు..

### ఎనిమిది మంది మృతి.. 100 మందికిపైగా గాయాలు

న్యూఢిల్లీ,

హిమాలయ దేశం నేపాల్ లో ఘర్షణ వాతావరణం నెలకొంది. సోషల్ మీడియాపై విధించిన నిషేధం హింసకు దారి తీసింది. నేపాల్ ప్రభుత్వం ఇటీవలే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్, స్నాప్‌చాట్ తదితర 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా వేలాదిమంది యువత రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ఖాట్మాండూలోని నేపాల్ పార్లమెంట్ వైపుకు నిరసనకారులు దూసుకెళ్లారు.



అప్రమత్తమైన పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో భద్రతా దళాలు రబ్బర్ బుల్లెట్స్‌తో కాల్పులు జరిపారు. అంతేకాదు, టియర్ గ్యాస్, వాటర్ కెనాన్స్ ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 100 మందికిపైగా గాయపడ్డారు. పరిస్థితిని ముందే అంచనా వేసిన అధికారులు సోమవారం న్యూ బనేశ్వర్, చుట్టుపక్కల ప్రాంతాలలో కర్ఫ్యూ విధించారు. నిరసనలో పాల్గొన్న వేలాది మంది యువకులు వీధుల్లోకి రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులు నిషేధిత ప్రాంతంలోకి చొరబడటంతో పరిస్థితి మరింత దిగజారింది. దీంతో సైన్యం రంగంలోకి దిగాల్సి వచ్చింది. మరోవైపు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12:30 నుండి రాత్రి 10 గంటల వరకు నగరంలో కర్ఫ్యూ విధిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## 2025 సెప్టెంబర్ 9, మంగళవారం తెలుగు పంచాంగం




**మాసం -పక్షం**
భాద్రపద మాసం, కృష్ణపక్షం

**తిథిజి**
ద్వితీయ: సెప్టెంబర్ 8 9:12 PM - సెప్టెంబర్ 9 6:29 PM
తృతీయ: సెప్టెంబర్ 9 6:29 PM - సెప్టెంబర్ 10 3:38 PM

**నక్షత్రం**
ఉత్తరాభాద్రపద: సెప్టెంబర్ 8 8:02 PM - సెప్టెంబర్ 9 6:07 PM
రేవతి: సెప్టెంబర్ 9 6:07 PM - సెప్టెంబర్ 10 4:03 PM

**సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: 4:31 - 5:19 AM
అభిజిత్: 11:48 AM - 12:37 PM
అమృతకాలం: 2:07 - 3:36 PM

**అశుభ సమయాలు**
రాహుకాలం: 3:16 - 4:48 PM
యమగండం: 9:10 - 10:41 AM
గులికా: 12:13 - 1:44 PM
దుర్ముహూర్తం: 8:33 -9:22 AM, 11:02 - 11:49 PM
వర్జ్యం: 4:52 - 6:20 AM(మొదటి)బీ 5:05 - 6:33AM(అదనపు)

## భీమారం పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**ఫరూక్‌నగర్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఫరూక్‌నగర్ మండల పరిధిలోని భీమారం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, దాత ఎలుకుర్తి జగదీశ్వర్ కుటుంబం సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.పాఠశాల విద్యార్థులకు నోట్బుక్స్, షూస్, సాక్స్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. "ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎదగాలన్న సంకల్పంతోనే ఈ బహుకరణ చేపట్టాం," అని దాతలు ఎలుకుర్తి జగదీశ్వర్, వీరేష్, నాగరాజు తెలిపారు. హెచ్ఎం శ్రీలత అధ్యక్షతన పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. "భీమారం గ్రామం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు మా శక్తి మేర సహకరిస్తాం," అని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు గందె సురేష్ వివరించారు.ఫరూక్‌నగర్ మండల్ ప్రెసిడెంట్, బుక్స్ కమిటీ చైర్మన్ ఎలుకుర్తి నారాయణ మాట్లాడుతూ, "షాద్నగర్ దాతల సహకారంతో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నోట్బుక్స్ పంపిణీ కొనసాగుతోంది," అని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో యంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, అన్మారి మురళి, ఎలుకుర్తి నాగరాజు, దండు నవీన్, కల్వ మాణిక్యం, గుడిపల్లి వెంకటరమణ, గార్లపాటి నవీన్ కుమార్, ఉప్పల శ్రీనివాస్, గుబ్బ సురేష్, మలిపెద్ది శ్రీనివాస్, బండారి శంకర్, ఉప్పల సత్యం, పెనుగొండ అశోక్, గజవాడ యశ్వంత్, నర్సి వెంకటేష్, కక్కునూరి వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై మంత్రి తుమ్మలతో బీఎల్ఆర్ భేటీ



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఖమ్మంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వారరావును మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఈరోజు కలిశారు. నియోజకవర్గంలో యూరియా కొరతతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మిర్యాలగూడకు అత్యధికంగా యూరియా మంజూరు చేయాలని కోరారు.రైతుల సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల, సంబంధిత అధికారులకు తక్షణమే ఫోన్ చేసి రెండు మూడు రోజుల్లో అవసరమైన యూరియాను అందించాలని ఆదేశించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.బత్తుల లక్ష్మారెడ్డి చొరవతో మిర్యాలగూడ రైతులకు త్వరలోనే యూరియా అందుబాటులోకి రానుంది. రైతుల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ప్రజాప్రతినిధికి పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిజియోథెరపీపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టర్ ఆఫీస్ వద్ద కేక్ కట్ చేసి, అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీకి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ నాయక్ జెండా ఊపి ప్రారంభం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేటి కాలంలో ఫిజియోథెరపీ వైద్యరంగంలో కీలక స్థానం సంపాదించుకుంది. శారీరక సమస్యలతో పాటు మానసిక స్థైర్యాన్ని కలిగించే చికిత్స ఇది. మందులపై ఆధారపడకుండా ఆరోగ్యాన్ని మెరుగుపరచే మార్గం ఫిజియోథెరపీ," అని వివరించారు.తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుమంత్, కార్యదర్శి చంద్రపాల్ రెడ్డి పాల్గొని, "ప్రజల్లో ఫిజియోథెరపీపై అవగాహన పెంచేందుకు ఈ ర్యాలీ నిర్వహించాం," అని తెలిపారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సదస్సును జయప్రదం చేయండి

**యాదాద్రి,సెప్టెంబర్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రజా సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్లో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సమావేశం వనం రాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈనెల 9న మంగళవారం రోజు పట్టణ కేంద్రంలోని దివ్య ఫంక్షన్ హాల్ లో తెలంగాణ సాయుధ పోరాటం ప్రజా విజయాలు-వాస్తవాలు-వక్రీకరణలు అనే అంశంపై జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జాకీర్దారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమమని అన్నారు. బానిసత్వంతో బ్రతుకుతున్న ప్రజలను సంఘటితం చేసి ప్రజలను విముక్తి చేశారని అన్నారు. గెరిల్లా ఉద్యమాలను నడిపి 3000 గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలను పేద ప్రజలకు భూమిని పంచిన మహోన్నత పోరాటం సాయుధ రైతాంగ పోరాటం అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరులో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని అన్నారు. దోపిడి ,పీడన అసమానతలతో బానిస బ్రతుకుల విముక్తికై కుల




,మతాల అతీతంగా జరిగిన ఈ పోరాటం దేశ విదేశాలను ఆకర్షించిందని అన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని వెలుగెత్తి చాటిందని అన్నారు. ఎలాంటి త్యాగచరితలేని, పోరాట వారసత్వం లేని ప్రజా అభ్యుదయం లేని, మతోన్మాద అవకాశవాద రాజకీయాలకు తెరలిపిన బిజెపి, సంఘ్ పరివార శక్తులు మహోజ్వల వీర తెలంగాణ పోరాట చరిత్రను మతోన్మాద దుష్టత్వం నుండి చూసి వికృత భాష్యాలు చెప్పి ప్రజలు నిర్మించిన చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్న మతోన్మాద శక్తుల ప్రచారాలను ప్రజలంతా తిప్పికొట్టలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గంధమల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, కల్లూరి నాగమణి, పట్టణ కమిటీ సభ్యులు వల్దాస్ అంజయ్య, పర్వతం బాలకృష్ణ పాల్గొన్నారు.

## టెట్ అంశంపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలి

### టిఆర్టిఎఫ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పును దృష్టిలో ఉంచుకుని, విద్యాశాఖ లీగల్ సెల్ మరియు ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ విజ్ఞప్తి చేశారు.విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఈ విషయాన్ని ప్రాతినిధ్యం వహిస్తూ తెలియజేశారని ఆయన తెలిపారు. టెట్ నిబంధనల కన్నా ముందు నియామకమైన ఉపాధ్యాయులకు ఎన్సిటిఈ ఇచ్చిన మినహాయింపు, రాష్ట్ర ప్రభుత్వం 2011లో జారీ చేసిన 51 జీవో వంటి అంశాలను పరిశీలించి, అవసరమైతే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు."సుప్రీంకోర్టు తీర్పు ఉపాధ్యాయ వర్గంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే తగు చర్యలు తీసుకోవడానికి, ఉపాధ్యాయులకు స్పష్టమైన సమాచారం అందించేందుకు ఈ సమావేశం ఎంతో అవసరం," అని కటకం రమేష్ పేర్కొన్నారు.విద్యాశాఖ అధికారులు, లీగల్ సెల్, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి సమగ్రంగా చర్చించి, ఉపాధ్యాయుల హక్కులను కాపాడే దిశగా ముందడుగు వేయాలని టిఆర్టిఎఫ్ కోరుతోంది.

## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ





**కడ్తాల్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సామాజిక చైతన్య రగిలించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని షాద్నగర్ ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి అన్నారు. కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాటం యావ త్ తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని వారన్నారు ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యట గీత నరసింహ, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, లక్ష్మి నరసింహ రెడ్డి, గోపాల్, రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ అధ్యక్షులు కృష్ణమూర్తి, రాష్ట్ర నాయకులు గాంధీ, నాయకులు మల్లేష్, శ్రీనివాస్, సోమరాజు వెంకటేష్ నరేష్ గౌడ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్పేట్ నీటి సమస్యపై బీజేపీ ఆగ్రహం



**బడంగ్పేట్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జెడ్పి హెచ్ఎస్ పాఠశాలలో ఉన్న అండర్‌గ్రౌండ్ ట్యాంక్ రంధ్రం వల్ల కలుషిత నీరు ప్రజలకు సరఫరా అవుతోంది. విద్యార్థులు అదే నీటితో చేతులు కడుగుతుండగా, గ్రామస్తులు తాగునీటిగా వినియోగిస్తున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందన లేకపోవడంతో బీజేపీ నాయకులు స్వయంగా ట్యాంక్‌ను మూసివేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నడికుడి యాదగిరి మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం అసహ్యం. సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం," అని హెచ్చరించారు. బీజేపీ తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని ముమ్మరం చేస్తామని స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, గుర్రం మల్లారెడ్డి, గౌరా రమాదేవి, కుంటి భాస్కర్, జగదీశ్వర్ రాజు, అగ్రిసెట్టి సైదులు, ప్రవీణ్ గౌడ్, బంగారు సాహిల్, ముదిగొండ అశ్విన్, బంటి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పిలవాలని మంత్రికి వినతి



**యాదాద్రి,సెప్టెంబర్ 08( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** జూలూరు,రుద్రవెల్లి హైలెవర్ బ్రిడ్జి 12 సంవత్సరాలుగా పెండింగ్లో ఉందని, పాత కాంట్రాక్టర్ టెండర్ రద్దుచేసి కొత్త ఏజెన్సీ ద్వారా నిధులు కేటాయించి పండ్లు ప్రారంభించాలని కోరుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. భువనగిరి , చిట్యాల రోడ్డు ప్రస్తుతం నేషనల్ హైవే లో ఉన్నదనీ , ఈ రోడ్డును ఆర్ & బీ రోడ్డుకు బదిలీ చేయాలని, హెచ్ ఏ ఎం పథకం కింద నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరించి పనులను వేగవంతం చేయాలని, మూసీ నదిపై ఉన్న బోల్లెపల్లి- సంగెం బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ పిలిచి పనులు త్వరితగతిన ప్రారంబించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ బేటీలో ఆర్ & బీ ఈఎన్ సి మోహన్ నాయక్ పాల్గోన్నారు.

# స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు

**దేవరకొండ,సెప్టెంబర్ 08(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిస్వార్థ సేవకు ప్రతీక డాక్టర్ సునీల్ కుమార్ ఫిజియోథెరపీలో ఓ అభిమన్యుడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్ కుమార్ సౌజన్యంతో ఉచిత క్యాంపు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ వెంకట్ రెడ్డి , అధ్యక్షుడు ఎన్ విటిసభ్యులతో కలిసి క్యాంప్ ని ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ ఫిజియోథెరపీ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడం కోసం 1996లో ప్రపంచ శారీరిక చికిత్స సమాఖ్య ఈ దినోత్సవాన్ని ప్రారంభించిందని, తక్కువ వెన్నునొప్పి వంటి పరిస్థితులలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందని, నొప్పి తగ్గించి మెరుగైన జీవితాన్ని పొందవచ్చని,కొన్ని దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఫిజియోథెరపీ పాత్రను పోషిస్తుందని, కాబట్టి ఇలాంటి ఉచిత క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కాలంలో లాభాల కోసం పరుగులు తీసే మనుషుల మధ్య అరుదైన వ్యక్తులలో డాక్టర్ సునీల్ కుమార్ ఒకరు అని అన్నారు. అలాగే దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అమోఘం అద్భుతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్ కోశాధికారి కృష్ణ కిషోర్ సముద్రాల వెంకన్న తాళ్ల సురేష్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి భాస్కర్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, నేషనల్ కో కన్వీనర్, బుడిగ వెంకటేష్ ఎస్ ఎఫ్ ఐజిల్లా అధ్యక్షులు, కరాటే మాస్టర్స్ చైతన్య, గోపి, డాన్స్ మాస్టర్ ఏడుకొండలు, సందీప్, మన్ దీప్, రమేష్ స్వాతి, జమీర్, నాగరాజు, పల్లె కిరణ్, కొండల్, లక్ష్మణ్, ఖాసిం , పవన్ కళ్యాణ్, రహమత్,దాదాపు 69 మంది కి చికిత్స పొందారు.

# టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన పారిజాత నర్సింహారెడ్డి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్ష పదవిని చేపట్టి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలానికి చెందిన మాజీ మేయర్ చికిరింత పారిజాత నర్సింహారెడ్డి.
న్యూ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. “పార్టీకి నాయకత్వం వహిస్తూ, రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్‌కి మా అభినందనలు,” అని పారిజాత నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**యాదాద్రి,సెప్టెంబర్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 57 అర్జీలను, జిల్లా కలెక్టర్,జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తో కలసి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. స్టేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 34,జిల్లా పంచాయతీ 5, జిల్లా శిశు సంక్షేమ శాఖ 4, సర్వే ల్యాండ్ 2, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, వైద్య ఆరోగ్యశాఖ 2, ఎంపీడీవో పోచంపల్లి 2, మున్సిపాలిటీ, అగ్రికల్చర్, విద్య, ఇరిగేషన్, రెసిడెన్షియల్ స్కూల్, ఆర్టీసీ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,హౌసింగ్ పి.డి విజయసింగ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం అమలు చేయాలి



**దేవరకొండ, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని కేంద్రం తక్షణమే అమలు చేయాలని సిపిఐ డిండి మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి హుస్సేన్ డిమాండ్ చేశారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.
కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి భారీ బడ్జెట్ కేటాయించి, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని కోరారు. పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించడంతో పాటు, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని, బడుగు బలహీన వర్గాల మహిళలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేసి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు రూ.12,000 ఇవ్వాలని, సామాజిక పెన్షన్లను రూ.4,000కి, వికలాంగుల పెన్షన్లను రూ.6,000కి పెంచి అర్హులందరికీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం






**యాచారం, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** యాచారం మండలం నక్కర్త మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పి.ఆర్.జీ ఫౌండేషన్ అధ్యక్షులు పొద్దుటూరీ రవీందర్ గుప్తా, ఆయన ధర్మపత్ని, పూర్వ విద్యార్థినీ అయిన ప్రొద్దుటూరీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం ఉదయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మొక్కపల్లి స్వరూప, విశ్రాంతి ఉపాధ్యాయులు బోగ్గల పాపిరెడ్డి, పూర్వ విద్యార్థి కమిటీ చైర్మన్ ఎండి గౌస్, పూర్వ విద్యార్థి బన్నీ శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అట్టడుగు కులాలపై ఆధిపత్యం నశించాలి

కొర్ర చందు నాయక్



**దేవరకొండ, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ పట్టణంలో సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. మీనాక్షి చౌరస్తాలో గిరిజన మహిళ అధికారిపై అగ్రవర్ణాల ప్రవర్తనను తీవ్రంగా ఖండించిన రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర చందు నాయక్, అట్టడుగు వర్గాలపై అగ్రవర్ణాల ఆధిపత్యం తక్షణమే ముగియాలని డిమాండ్ చేశారు.ఉన్నత పదవుల్లో ఉన్నా, అట్టడుగు వర్గాలకు ఉద్యోగాల్లో ఆటంకాలు కలిగించడం దౌర్జన్యమని, క్షమాపణ కోరే పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. అగ్రవర్ణాల దౌర్జన్యాలకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దేవరకొండలో జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హరి నాయక్, రాజు, రాము నాయక్, శంకర్ నాయక్ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు టి.ఎం.టి.యు సన్మానం



**నల్గొండ, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ దుగ్యాల (పి.ఏ పల్లి మండలం)లో అర్థశాస్త్రం పి.జి.టి గా విధులు నిర్వహిస్తున్న గరిడి విజయ భాస్కర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతులమీదుగా అవార్డు ప్రదానం జరిగింది.ఈ సందర్భంగా టి.ఎం.టి.యు ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ హెచ్.బి.టి ల సమక్షంలో విజయ భాస్కర్‌ను శాలువాతో సన్మానించి శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టి.ఎం.టి.యు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.ఏ ఖాలిక్, గౌని రవి, కాటమోని శివ, పి. శాంసన్, ఎస్. కరుణాకర్, శిగ శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

# శేరిగూడ పాఠశాలలో ఉపాధ్యాయుల ఘన సన్మానం



**మహేశ్వరం, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహేశ్వరం మండలంలోని ఎం.పి.పి.ఎస్. శేరిగూడ పాఠశాలలో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాపోలు ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, విద్యార్థుల అభివృద్ధికి వారు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్.పి.హెచ్.ఎస్. శేరిగూడ పాఠశాల కాంప్లెక్స్ గ్రూప్ హెడ్ మాస్టర్ శ్రీ కాల శ్రీనివాస్ గారు హాజరై, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని, వారి అంకితభావం వల్లనే పాఠశాలలు విద్యా క్షేత్రాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు.
పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి, రజిని, మల్లేష్, ఆంజనేయులు గార్లు విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# మాలల ఉద్యమాలను ఆపలేరు

మాల మహానాడు నేతల హెచ్చరిక



**వెల్దండ, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం చేస్తోందని, జీవో 99 రద్దు చేయాలని, రోస్టర్ పాయింట్లను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపట్టిన మాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని మాల మహానాడు నేతలు తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జంగిలి నిరంజన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, రవికుమార్, గోరటి రాజు, జంగిలి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## రీజనల్ రింగ్ రోడ్ అలైన్మెంట్
# మార్చాలంటూ రైతుల రాస్తారోకో





**ఆమనగల్లు సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మాడుగుల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు చెందిన రైతులు రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు అలైన్మెంట్‌ను తక్షణమే మార్చాలని డిమాండ్ చేస్తూ ఆమనగల్లు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పెసరకాయల జంగారెడ్డి మాట్లాడుతూ, "వందల ఎకరాల భూస్వాముల భూములను కాపాడుతూ, పేద రైతుల భూములను ఆక్రమించడమే ఈ కొత్త అలైన్మెంట్ లక్ష్యమని, ఇది దౌర్జన్యమని" ఆగ్రహం వ్యక్తం చేశారు. "రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభపడేలా అలైన్మెంట్ మార్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక రామచందర్, నాయకులు పగడాల యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల అంజయ్య, ఉపాధ్యక్షులు కానుగుల వెంకటయ్య, ప్రజాసంఘాల నాయకులు పిప్పళ్ళ శివశంకర్, గుమ్మడి కురుమయ్య, చెన్నంపల్లి మాజీ సర్పంచ్ పబ్బతి శ్రీను, పరమేష్, శివగల రమేష్, దుబ్బ చెన్నయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. భూ నిర్వాసితులైన తిరుపతి రాజు, కృష్ణ, లక్ష్మయ్య, జ్యోతి, రాఘవేందర్, జంగమ్మ, బలరాం, రాకేష్, శంకర్, రవీందర్, చెన్నయ్య, యాదమ్మ, వెంకటయ్య తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. రైతు సంఘం నేతలు హెచ్చరిస్తూ, "అలైన్‌మెంట్ వెనక్కి తీసుకోకపోతే, భూ నిర్వాసితులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని స్పష్టం చేశారు.

# సమాధాన్ ను సన్మానించిన గణపతి ఉత్సహ కమిటీ..



**వనపర్తి, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల దగ్గర ప్రతిష్టించిన మహా గణపతి లడ్డు ను వేలం పాటలో 8లక్షలకు దక్కిచుకున్న సమాదాన్ ను సోమవారం పట్టణ గణపతి ఉత్సహ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం గా పట్టణ గణపతి ఉత్సహ కమిటీ అధ్యక్ష కార్యదర్శి లు బొల్లంపల్లి నగేష్, గట్టు వెంకన్న లు మాట్లాడుతూ సమాదాన్ అనే వ్యక్తి ఇప్పటి వరకు గణపతి విగ్రహాల దగ్గర నిర్వహించిన వేలం పాట లో 16 సార్లు లడ్డు ను దక్కించుకుని తన భక్తి భావాన్ని చాటుకున్నారని వారు కొనియాడారు వనపర్తి పట్టణంలో మొదటి సారిగా పాలిటెక్నిక్ కళాశాల దగ్గర 21 అడుగుల భారీ గణనాథున్ని విగ్రహన్ని ప్రతిష్టించడం జరిగిందన్నారు. వినాయకుని విగ్రహం దగ్గర నిష్టతతో 11 రోజుల పాటు గణపతి హొమం, గోమాత హొమం చేశామన్నారు పట్టణంలోని భక్తులు, ప్రజలు విఘ్నేశ్వరుని దర్శించుకో వడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారని వారు చెప్పారు. మహా గణపతి నిమజ్జనం కు ముందు 31 కిలోల లడ్డు ను వేలం వేశామని వారు తెలిపారు. చాల మంది భక్తులు వేలం పాటలో లడ్డు ను దక్కించుకునేందుకు పోటీ పడ్డారని వారు వివరించారు. వెలం పాటలో గట్టు శశి 7లక్షల 50 వేల వరకు లడ్డు వేలం పాటలో పోటీ పడ్డారని వారు వెల్లడించారు. అయితే, సమాదాన్ 8 లక్షల 1 వెయ్యి 116 లు పాడి గణపతి లడ్డు దక్కించుకున్నారని వారు చెప్పారు. గణపతి నాథునిపై సమాదాన్ కు ఉన్న భక్తి ని కొనియాడుతూ అతని ఇంటికి వెళ్లి భార్యభర్తలను శాలువా తో సన్మానించి, పూల మాలలతో సత్కరించామని వారు చెప్పారు. సమాదాన్ కుటుంబం అష్టఐశ్వర్య లతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఎల్లప్పుడు ఆ గణపతి దేవుని ఆశీర్వాదం ఉంటుందని భావిస్తున్నామని వారు చెప్పారు. ఇదే భక్తి భావాన్ని సమాధాన్ కొనసాగించాలని, అందుకు భగవంతుని కృప ఉండాలని వారు తెలిపారు. గణపతి నిమజ్జనోత్సవం లో పాల్గొన్న వారందరికి పట్టణ గణపతి ఉత్సహ కమిటీ తరుపున వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్య క్రమంలో గణపతి ఉత్సహ కమిటీ సభ్యులు ఆర్ బి రవిసాగర్, వెంకటేశ్, ఉప్పల బాస్కర్, కమతం చెన్నయ్య, రాము, నరేష్, శ్రీ కాంత్, శరత్, సంగార్కార్, శివ, బాల ప్రతాప్ తదితరులు ఉన్నారు.

# నిరుపేద విద్యార్థి చదువుకు అండగా వ్యాక్ ఫౌండేషన్

**రూ.10వేల చెక్కును అందజేసిన వ్యాక్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ**



**వరంగల్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** నిరుపేద విద్యార్థుల చదువులకు వ్యాక్ ఫౌండేషన్ ద్వారా చేయూతనిచ్చి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నట్లు వ్యాక్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ తెలిపారు. సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 35 వ డివిజన్ మైసయ్య నగర్ పేద కుటుంబానికి చెందిన కొంగ అరుష్, తండ్రి రాజు విద్యార్థికి వ్యాక్ ఫౌండేషన్ ద్వారా రూ. 10వేల చెక్కును వ్యాక్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ గత పదిహేడు సంవత్సరాలనుండి మా ఫౌండేషన్ పలు సామజిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటు పేదప్రజలకు భరోసా ఇస్తూ అండగా ఉంటున్నామని, భవిష్యత్తులో కూడా సామజిక సేవలో, పేదప్రజలకు అండగా మా ఫౌండేషన్ ఉంటుందని పేర్కొన్నారు. వ్యాక్ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థుల చదువుకు ముందుకు రావడం గొప్ప విషయమని, విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డా. వన్నాలతో పాటు బిజెపి వరంగల్ తూర్పు నియోజకవర్గం ఐటీ అండ్ సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్, శివనగర్, కాశిబుగ్గ మండలం ఎండీ రఫీ, అపురూప రజనీష్, శివనగర్ మండల ప్రధానకార్యదర్శి వైట్ల గణేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన బైక్‌లే టార్గెట్‌గా దొంగతనాలు



**షాద్‌నగర్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్‌నగర్ పట్టణంలో ఇంటిముందు తాళం వేసి పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూలై 7న ఇందిరానగర్ కాలనీలో బైక్ చోరీ జరిగిన ఘటనపై బాధితుడు జూలై 11న ఫిర్యాదు చేయగా, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు కందుకూరు మండలం దబిలిగూడకు చెందిన మెతుకుపల్లి శివ, కొత్తూరు మండలం కొడిచెర్లకు చెందిన బ్యాగరి రామచందర్‌లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ పర్యవేక్షణలో సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివ రెడ్డి, సిబ్బంది రవీందర్, సంతోష్, జాకీర్, రాజు కేసు ఛేదించడంలో కీలక పాత్ర పోషించారు. వారికి రివార్డులు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

## గురుపూజోత్సవంలో ఉపాధ్యాయులకు సన్మానం



**కరీంనగర్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండల స్థాయి గురుపూజోత్సవ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల ఎంఈఓ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆర్డీవో మహేశ్వర్ హాజరై, ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయులు జాతికి వెన్నెముకలంటూ, దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ, తల్లిదండ్రులు జన్మనిస్తే, ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత వహిస్తున్నారని, మండలంలోని ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడుతున్నారని కొనియాడారు. మండలంలోని 42 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి మెమెంటో, శాలువా, సర్టిఫికెట్లతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్సీడీ ప్రక్రియపై వినతిపత్రం ఇచ్చిన ఏఎన్ఎం సిస్టర్స్




**తెలకపల్లి, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం సిస్టర్స్ ఎన్సీడీ ఆన్లైన్ ప్రక్రియను తొలగించాలని డాక్టర్ భాను గారికి వినతిపత్రం అందజేశారు. 2008లో నియమితులైన వారు మూడు సంవత్సరాలుగా తమ విధుల్లో భాగం కాని నాన్ కమ్యూనికబుల్ డిసీస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో వ్యాక్సినేషన్, వైద్య సేవలతో పాటు ఆన్లైన్ ప్రక్రియను మాతో చేయించడం అన్యాయమని పేర్కొన్నారు. తాత్కాలిక ఉద్యోగులను నియమించకపోతే రాష్ట్రస్థాయి ధర్నాలు నిర్వహించి పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుగుణ, సౌమ్య, పుష్ప, జలజ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు సన్మానం



**తెలకపల్లి, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలకపల్లి మండల విద్యాధికారి కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు జయమ్మ, మురళీధర్ రెడ్డి, బాలయ్య, విజయకుమార్, శ్రీనివాసులు, షానావాజ్, ఉమా బాయ్, జైపాల్‌లను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాధాకృష్ణ చూపిన మార్గంలో నడవాలని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, నరహరి, తదితరులు ఉపాధ్యాయ వృత్తి గొప్పదని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఉపాధ్యాయ దినోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించాలని చంద్రశేఖర్, సునీల్, మల్లేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో శోభన్ బాబు, మురళీధర్ రెడ్డి, శివప్రసాద్, నరహరి, సుజీవన్ రెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్, సునీల్, విజయ రెడ్డి, శ్రీనివాసులు, జైపాల్, తిరుపతయ్య, ఎంఆర్సి బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లింగోజిరావు వర్ధంతి



**తెలకపల్లి, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలకపల్లి మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో సోమవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ లింగోజిరావు వర్ధంతిని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, ఆర్. శ్రీనివాసులు, గోపాస్ లక్ష్మణ్, మధు, విజయ్ గౌడ్, మల్లయ్య, నిరంజన్, బచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మహిళా ఆర్చరీ ఛాంపియన్ చికిత



**హైదరాబాద్, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో సోమవారం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మహిళా ఆర్చరీ ఛాంపియన్ తానిపర్తి చికిత మర్యాదపూర్వకంగా కలిశారు. కెనడాలో జరిగిన 25వ యూత్ వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున బంగారు పతకం సాధించిన తొలి మహిళగా రికార్డు సృష్టించిన చికితను సీఎం అభినందించారు.ఒలింపిక్స్‌లో పతకం సాధించేలా ప్రభుత్వం తరఫున పూర్తి శిక్షణ, ఆర్థిక సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచల రాజేందర్ రావు, మాజీ సర్పంచ్ అర్చన, పెల్లి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల శిక్ష



**మాడుగుల, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మాడుగుల పోలీస్ స్టేషన్లో 2020 జూన్ 16న నమోదైన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న మేరావత్ శ్రీను అలియాస్ చరణ్‌కు షాద్‌నగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి శ్రీ ఆంజనేయులు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. రాజీవ్ నగర్ తండా, మాడుగుల మండలానికి చెందిన నిందితుడిపై 376(2)(n), 376(3), 323 ఐపీసీ సెక్షన్లు మరియు పోక్సో చట్టంలోని 5, 6 సెక్షన్ల కింద కేసు నమోదు అయింది.ఈ కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన ఇన్స్పెక్టర్లు పి. సైదులు, బి. ఉపేందర్ రావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. శంకరాచారి, కోర్ట్ డ్యూటీ అధికారులు ఎస్కే. జాఫర్, యు. నాగరాజులను మాడుగుల స్టేషన్ హౌస్ ఆఫీసర్ టి. వేణుగోపాల్ అభినందించారు.

## కరెంట్ షాక్‌తో వృద్ధుడి మృతి



**మాడుగుల, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈసం లక్ష్మయ్య (70) అనుకోని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఫిర్యాదుదారుడు ఉడుతల యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 1న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్ వైరును స్విచ్ బోర్డులో పెట్టే ప్రయత్నంలో లక్ష్మయ్య కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయారు. అప్పట్లో ఆయన ఆరోగ్యం బాగానే ఉండడంతో ఆసుపత్రికి తీసుకెళ్లలేదు.అయితే ఆరోగ్యం క్రమంగా విషమించడంతో సెప్టెంబర్ 5న మాల్‌లోని పీపుల్ హాస్పిటల్‌కు, అనంతరం మెరుగైన చికిత్స కోసం సెప్టెంబర్ 7న హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 3 గంటల సమయంలో ఆయన మృతి చెందారు.ంఈ ఘటనపై మాడుగుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ ఇన్స్పెక్టర్ తెలిపారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎలిగేడు మండల కాంగ్రెస్ నేతలు



**ఎలిగేడు, సెప్టెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో సోమవారం ఎలిగేడు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నాయకులు ముఖ్యమంత్రిని కలవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

## వ్యవసాయ కూలీలకు న్యాయం చేయాలి

**-బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి సృజన్**



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వ్యవసాయ కూలీల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని అమలు చేయాలని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన ధర్నాలో పాల్గొన్న ఆయన, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేసి ప్రతి కూలీకి రోజుకు రూ.700 వేతనం, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇన్సూరెన్స్, 50 ఏళ్లు నిండిన వారికి రూ.5000 పెన్షన్, పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఇందిరమ్మ భరోసా' పథకం కింద వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఇవ్వాలని, సామాజిక పెన్షన్ రూ.4000, వికలాంగుల పెన్షన్ రూ.6000గా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ ఇవ్వాలని సృజన్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోయిని అశోక్, నాయకులు గంటె రాజేశం, విలసాగరం అంజయ్య, కూన రవి, చందు, ఐలయ్య, రాజేందర్, లచ్చవ్వ, కనుకవ్వ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యార్థులకు నైపుణ్య విద్య సేవలు విస్తరించాలి: కలెక్టర్ పమేలా



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించేందుకు ప్రైవేటు భాగస్వామ్యంతో ఎంఓయూలు కుదుర్చుకోవడం ద్వారా మరిన్ని రంగాల్లో సేవలు విస్తరించనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కొత్తపల్లి (హవేళి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జేఈఈ, ఐఐటీ, నీట్ కోర్సుల పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ట్రస్మా అధ్యక్షుడు, నందిని కాన్వెంట్ నిర్వాహకులు యాదగిరి శేఖర్ రావు ఉచితంగా అందించిన ఈ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల సహకారంతో శిక్షణ, పోటీ పరీక్షల సన్నద్ధత, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో విజయవంతంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు చదవడం, రాయడంపై దృష్టి పెట్టాలని, ఉపాధ్యాయులు ప్రతినెలా రీడింగ్-రైటింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కొత్తపల్లి పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, ఇక్కడి విద్యార్థులు వివిధ రంగాల్లో ఎంపిక అవుతున్నారని కలెక్టర్ ప్రశంసించారు. అనంతరం విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, విటమిన్ గార్డెన్‌ను పరిశీలించారు. భవిత కేంద్రాన్ని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలకు మార్చిన నేపథ్యంలో, కలెక్టర్ స్వయంగా ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, ఎంఈఓ తుమ్మ ఆనందం, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహేష్ జీతం ఆలస్యానికి ప్రభుత్వ కారణం కాదు: బానోత్ రవి చందర్



**ములుగు, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మల్టీ పర్పస్ వర్కర్ మైదం మహేష్ పురుగుమందు తాగి మృతి చెందిన ఘటనను రాజకీయంగా వాడుకోవడం దారుణమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ విమర్శించారు. జీతం ఆలస్యం ప్రభుత్వ వైఫల్యం వల్ల కాదని, స్థానిక పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తెలిపారు. బాధ్యులపై చర్యగా ఇద్దరిని విధుల నుంచి తొలగించారని వెల్లడించారు.కేటీఆర్ గతంలో కార్మికుల సమస్యలపై స్పందించలేదని, ఇప్పుడు కపట ప్రేమ చూపడం హాస్యాస్పదమని మండిపడ్డారు. మహేష్ కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందించిందని, మిగిలిన కార్మికులకు జీతాలు సమయానికి అందుతున్నాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, వంగ రవి యాదవ్, నల్లెల్ల భరత్ కుమార్, యాసం రవీందర్, బోడ రఘు, ఓరుగంటి అనిల్ కుమార్, గుంటోజు శంకర్ చారి, నేపాల్ రావు, మట్టేవాడ తిరుపతి, కుక్కల నాగరాజు, సయ్యద్ షకీల్ అహ్మద్, జాఫర్ పాషా, కెక్కెర్ల అశోక్ గౌడ్, అభినయ్ చారి, గందే రాజు, లక్కీ, ధారవత్ సారయ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారిగా శాతవాహన ఉపకులపతికి ప్రశంసాపత్రం



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పరిపాలనా బాధ్యతలు, విద్యా ప్రమాణాల పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన సమర్థతకు గుర్తింపుగా ఈ ఏడాది ఉత్తమ అధికారిగా జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేల సత్పతి ప్రశంసాపత్రం ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈ ప్రశంసాపత్రం అందుకోవాల్సి ఉండగా, అదే రోజు అమెరికా పర్యటనలో ఉన్న కారణంగా ఉపకులపతి హాజరుకాలేకపోయారు. నేడు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉపకులపతి, ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో విశ్వవిద్యాలయంలో జరుగుతున్న విద్యా, భౌతిక వసతుల అభివృద్ధి, నూతన కోర్సుల ప్రారంభం, న్యాక్ గుర్తింపు కోసం చేపట్టిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోందని ఉపకులపతి వివరించారు.


## ఉచిత ఆన్లైన్ కోచింగ్ ఫలితంగా రాష్ట్ర ఫస్ట్ ర్యాంక్

**– పుట్టి అఖిలకు అభినందనల వెల్లువ**



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం సహకారంతో మూడు నెలలుగా నిర్వహించిన ఉచిత ఆన్లైన్ కోచింగ్ రాష్ట్రవ్యాప్తంగా విశేష ఫలితాలను అందించింది. తాజాగా విడుదలైన పీజీ ఎంట్రెన్స్ ఫలితాల్లో వృక్షశాస్త్ర విభాగంలో రాష్ట్ర ఫస్ట్ ర్యాంక్‌ను పుట్టి అఖిల సాధించి కళాశాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా విస్తరించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఆర్ఆర్ కళాశాల, ఆర్‌బివిఆర్ఆర్ ఉమెన్స్ కాలేజ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల, ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల జగిత్యాల సంయుక్తంగా నిర్వహించిన ఈ కోచింగ్‌లో మొత్తం 40 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. బి. మేఘమాల (రాష్ట్ర 6వ ర్యాంక్), సిహెచ్. సాగరిక (53), సుమయ జబీన్ (69), ఆర్. సుధాకర్ (57), కే. మౌనిక (98), జి. నర్మదా (96), డి. మౌనిక (134), వి. మహేందర్ (324), సిహెచ్. పల్లవి రెడ్డి (334), కే. అంజలి (819), ఎన్. రోజా (893), బి. అఖిల (957) తదితరులు ప్రతిభ కనబర్చారు. ఈ కోచింగ్‌కు కన్వీనర్‌గా వ్యవహరించిన డాక్టర్ పడాల తిరుపతి, విభాగాధిపతి డాక్టర్ తిరుక్కోవల శ్రీనివాస్, సహాయ ఆచార్యులు, రిసోర్స్ పర్సన్లు అందరి కృషిని ప్రశంసించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేంద్ర సింగ్, ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ బి. దిగంబరావ్, ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపల్‌లు అరిగేలా అశోక్, జై అచ్యుతాదేవి, విజయ్ కుమార్ తదితరులు విద్యార్థులను అభినందించారు. చివరిగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఉచిత ఆన్లైన్ కోచింగ్ నిర్వహించడం అభినందనీయమని, రాష్ట్ర ఫస్ట్ ర్యాంక్ సాధించిన పుట్టి అఖిల కళాశాల గర్వకారణమని పేర్కొన్నారు.

## కమాన్‌పూర్‌లో వీధి దీపాల వెలుగు లేక చీకటి మయం




**కమాన్‌పూర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కమాన్‌పూర్ మండల కేంద్రంలోని గల్లీలన్నీ చీకటిలో మునిగిపోయాయి. ప్రతి వీధిలో నాలుగు నుంచి ఐదు విద్యుత్ స్థంభాలపై దీపాలు వెలగకపోవడం ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. గత నాలుగు నుంచి ఆరు నెలలుగా వీధి దీపాలు పనిచేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి పలుమార్లు చెప్పినా స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. చిప్పకుర్తి అరవింద్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ, నాణ్యతలేని దీపాలు అమర్చడం వల్ల అవి కొన్ని రోజుల్లోనే పాడవుతున్నాయని, దీపాల మరమ్మతులు చేయకపోవడం వల్ల రాత్రివేళల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో 85కి పైగా దీపాలు వెలుగనివి అని పేర్కొన్నారు. ఇక సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో, విష జ్వరాలు ప్రజలను బలిపడుతున్నాయని ఆరోపించారు. దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, దోమల మందు పిచికారీ చేయకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్‌ను కోరారు.

# యూరియా కొరతపై నిరసనుమోడీ దిష్టిబొమ్మ దహనం



**అక్కన్నపేట, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండల కేంద్రంలో యూరియా కొరతపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య మాట్లాడుతూ, తెలంగాణ రైతులకు కావలసిన యూరియా, డీఏపీ వంటి ప్రధాన ఎరువులను సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, కేవలం 5 లక్షల టన్నుల మాత్రమే సరఫరా చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రామగుండం ఎరువుల కర్మాగారం ఉత్పత్తిని నాలుగు నెలలుగా నిలిపివేయడం వల్ల యూరియా కొరత మరింత తీవ్రతరం అయిందని పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రానికి మాత్రమే యూరియా ఎగుమతులు జరగడం, నానో యూరియాను బలవంతంగా రైతులకు మళ్లించేందుకు ప్రయత్నించడం కేంద్ర ప్రభుత్వ కుట్రగా అభివర్ణించారు.నానో యూరియాపై రైతులకు నమ్మకం లేకపోవడంతో కొనుగోలు జరగడం లేదని, పంటలు ఎండిపోకముందే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో తెలంగాణ రైతులను బలిచేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపం ఉంటే వేరే మార్గంలో తీర్చుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలిగించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ముత్యాల సంజీవరెడ్డి, బద్దం రాజిరెడ్డి, మేక తిరుపతి, సొసైటీ డైరెక్టర్లు బుర్ర ప్రభాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరెంతోతు రవి, బైక్ఎన్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాంద్రాల దాము, చింతల బాలరాజ్, బెజ్జంకి సారయ్య, సుజాత, సుకుర్తి బాలరాజ్, సంపత్, సారయ్య, బొమ్మ కనకయ్య, అక్బర్ బాషా, ధరవత్ తిరుపతి నాయక్, సంపత్ రెడ్డి, పంగ రాకేష్, రాంబాబు నాయక్, భాస్కర్ నాయక్, చింతల మల్లారెడ్డి, రాజిరెడ్డి, అశోక్, బందరం శ్రీనివాస్, సోమిరెడ్డి, చుక్కం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాంపూర్ సర్వే నెం.26 అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణకు డిమాండ్



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో ప్రభుత్వ కుంట శిఖం భూమి సర్వే నెం.26పై అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్‌కు ప్రజావాణి ద్వారా వినతిపత్రం అందజేసింది. దీనిపై సమగ్ర విచారణ చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, సర్వే నెం.26లో 30కిపైగా గృహాలు ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మించబడినట్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ నుండి అక్రమంగా ఇంటి నెంబర్లు పొందిన విషయాన్ని బయటపెట్టారు. గతంలో తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోయిందని విమర్శించారు. ఇదే సర్వే నెంబరులో ఉన్న సాయిబాబా దేవాలయం పక్కన మహిళా ప్రాంగణం కోసం నిర్మించిన భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికీ, మహిళా కేంద్రంగా వినియోగించకపోవడం వల్ల దేవాలయ అవసరాల కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజా అవసరాల దృష్ట్యా భవన వినియోగంపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని కోరారు.అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని, సర్వే నెం.26లోని భూమిని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె. బద్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 300 దరఖాస్తులు స్వీకరణుసత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి 300 దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను బదిలీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా డాక్టర్ తిరుమలకు ఘన సత్కారం



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని వెల్నెస్ సెంటర్‌లో ఫిజియోథెరపీ డాక్టర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ కే. తిరుమల ఫిజియోథెరపీ గారిని ఘనంగా సత్కరించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, సభ్యులు బొంగోని పరుషరాములు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. వైద్య రంగంలో ఫిజియోథెరపీ సేవల ప్రాధాన్యతను గుర్తించి, ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయన చేస్తున్న కృషికి ఈ సత్కారం అంకితమైంది. ఫిజియోథెరపీ ద్వారా శారీరక నొప్పులు, కండరాల సమస్యలకు మందుల్లేని ఉపశమనం అందించడంలో డాక్టర్ తిరుమల సేవలు ప్రశంసనీయం అని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.

## అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానం



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆచార్యులకు సన్మానం నిర్వహించారు. ఉపాధ్యాయుల సేవలు అక్షరాస్యత సాధనలో కీలకమని సంస్థ అధ్యక్షుడు అక్కెనపల్లి నాగరాజు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో సభ్యులు శివజ్యోతి, తాటిపెల్లి సతీష్, డా. నాళ్ల సత్య విద్యసాగర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అభినందిస్తూ సముద్రాల రాజమౌళి, డా. చక్రవర్తుల రమణాచారి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, రాపర్తి శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గోలి పూర్ణచందర్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకులాదేవి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ దీపికా హాస్పటల్‌లో యువతిపై అఘాయిత్యంసిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తీవ్ర నిరసన




**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ దీపికా హాస్పటల్‌లో చికిత్స కోసం వచ్చిన యువతిపై ఆసుపత్రి టెక్నీషియన్ మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దక్షిణ్ మూర్తిని అరెస్ట్ చేశారు. ఘటనపై సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని, పూర్తి నివేదిక అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు ఈ ఘటనపై సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ తీవ్రంగా స్పందించారు. పరారీలో ఉన్న హాస్పటల్ యాజమాన్యం, ముఖ్యంగా డాక్టర్ వెంకటేశ్వర్లుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాల పాటు ఆయన మెడికల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, ఆసుపత్రిని వెంటనే సీజ్ చేయాలని జిల్లా మెడికల్ అధికారులను హెచ్చరించారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని అంగిడి కుమార్ పేర్కొన్నారు.

## యూరియా కొరతపై మోడీ దిష్టిబొమ్మ దగ్ధంహుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిరసన



**హుస్నాబాద్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రైతాంగానికి అవసరమైన యూరియా ఎరువును సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేక కేంద్రం యూరియా పంపకపోవడం దారుణమని నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, రాష్ట్రానికి అవసరమైన 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో కేవలం 5 లక్షల టన్నుల మాత్రమే పంపడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 17 సార్లు కేంద్రాన్ని కలిసినా స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీజేపీకి చెందిన రాష్ట్ర ఎంపీలు యూరియా అంశంపై కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇక హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు రైతులకు టోకెన్లు ఇస్తామని చెప్పి మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద నిరసనకు దిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను చర్చకు సిద్ధమా అని సూటిగా ప్రశ్నించారు. ఆయన ఉద్యమ నాయకుడిగా తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారని, హుస్నాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వంగా సేవ చేయడానికి సిద్ధంగా ఉందని నాయకులు స్పష్టం చేశారు. ప్రజలు బీఆర్ఎస్ నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## కుల్గాంలో కాల్పులు

### ఉగ్రవాది మృతి

**జమ్ముకాశ్మీర్ సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాశ్మీర్‌లోని కుల్గాంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఉగ్రవాది మృతి చెందగా, ఒక సైనికుడు గాయపడ్డారని సైన్యం సోమవారం తెలిపింది. ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌లో భాగంగా సెర్చ్ ఆపరేషన్ చేస్తుండగా ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది మృతి చెందగా, ఆర్మీ అధికారికి గాయాలు అయ్యాయి. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## మానసిక వికలాంగుల పిల్లలకు వాసవి క్లబ్ సేవా కార్యక్రమం



**కరీంనగర్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉజ్వాలా పార్క్ ఐటీ టవర్ సమీపంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ కాపుల్స్ కరీంనగర్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ నేతృత్వంలో, వనిత అధ్యక్షురాలు జిల్లా రజిత జగదీష్ సహకారంతో పిల్లలకు అటవస్తువులు, బిస్కెట్ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. వికలాంగుల పిల్లలపై ప్రేమ, సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పాఠశాల వాతావరణాన్ని ఆనందభరితంగా మార్చింది. వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## స్ట్రీట్ లైట్ల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పందన



**రామగుండం, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్ ఇందిరమ్మ కాలనీ, పీకే రామయ్య కాలనీల్లో వర్షాల కారణంగా స్ట్రీట్ లైట్లకు కార్బన్ రావడంతో గత వారం రోజులుగా ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లగానే, ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆదేశాల మేరకు సోమవారం కార్పొరేషన్ ఎలక్ట్రికల్ సిబ్బంది రంగంలోకి దిగడంతో లైట్లు వెలిగాయి. రెండు నెలల క్రితం నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో, వాటికి తగిన నూతన లైట్లు అమర్చాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ అరుణశ్రీకు సూచించారు. త్వరలోనే కొత్త లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు ప్రజల తరఫున మడిపల్లి మల్లేష్ (కాంగ్రెస్ పార్టీ) ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల అవసరాల పై స్పందిస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# యూరియా సరఫరాలో జాప్యంతో పంట నష్టపరిహారం డిమాండ్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులకు యూరియా సరిపడ సప్లై చేయాలని, వర్షంతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యకుడు నంది రామయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఏర్పడిందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అతివృష్టి కారణంగా 13 జిల్లాల్లో పంటలు నష్టపోయాయని, ఎకరాకు ?50,000 నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్తి దిగుమతులపై 11% సుంకాలను పునరుద్ధరించాలని, కనీస మద్దతు ధరను ?10,075గా ప్రకటించాలని, పోడు భూముల సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న, జూపాక శ్రీనివాస్, తిగుట్ల రామయ్య, బుదరపు దేవయ్య, తోకల రమేష్, ఈసంపల్లి రాజేందర్, ఆడెపు శంకరన్న, పోల్లూరి భూషణం, కట్ట తేజేశ్వర్, కాల్వల రాయమల్లు, బరుపతి మల్లయ్య, చిలుక శంకర్, నాని, సునీత, ఉల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల పడిగాపులు

## - బీఎస్పీ తరపున సేవా కార్యక్రమం



**హుస్నాబాద్, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల కేంద్రానికి ఈరోజు దాదాపు 600 బస్తాల యూరియా చేరింది. అయితే యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు అర్ధరాత్రి నుంచే లైన్లో నిలబడి, ఎండ తీవ్రత మధ్య నీళ్ళు, అన్నం లేక అలసిపోయారు. ఈ క్రమంలో కొంతమంది మహిళలు సొమ్మసిల్లి పడిపోవడం కలకలం రేపింది. రైతుల పరిస్థితిపై స్పందించిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు, ఎండలో నిలబడిన రైతులకు త్రాగునీరు అందించి తమ వంతు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రైతులు నడి బజార్లో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారని బీఎస్పీ నేతలు విమర్శించారు. ఇకముందు 20 రోజుల పాటు ఇదే తరహా ఇబ్బందులు కొనసాగే అవకాశమున్న నేపథ్యంలో, బీఎస్పీ తరపున నీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించి రైతులను ఆదుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉందని పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుపల రాజు, ఎలగందుల శంకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# వాట్సాప్ సేవల్లో అంతరాయం..

## సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఫిర్యాదులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెటాకు చెందిన ప్రముఖ మెసింజర్ యాప్ వాట్సాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. భారత్ లోని యూజర్లు యాప్‌ను ఉపయోగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు ఎదురైన సమస్యలపై వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ సమస్య తలెత్తింది. వాట్సాప్ సేవల్లో అంతరాయంపై దాదాపు 410కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. వాట్సాప్‌లో మెసేజ్‌లు వెళ్లడం లేదని, స్టేటస్‌లు కూడా అప్‌లోడ్ కావడం లేదని పేర్కొంటున్నారు. దీంతో వారంతా తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. దాదాపు 54 శాతం మంది యూజర్లు సర్వర్ కనెక్షన్‌లో సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. 24 శాతం మంది డెస్క్‌టాప్‌లో, 22 శాతం మొబైల్ యాప్‌లో అంతరాయాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. యూజర్ల ఫిర్యాదులతో సోషల్ మీడియాలో 'వాట్సాప్ డౌన్..' హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంది.

# అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్ల జీతాల పెంపు

## నితీష్‌కుమార్ హామీ

**పాట్నా సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సిఎం నితీష్‌కుమార్ మరోసారి సిఎం అయ్యేందుకు ఆ రాష్ట్ర ప్రజలకు వరాల జల్లు కురిపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రజాకర్షక పథకాలను ఆయన ప్రకటించారు. తాజాగా చిన్నారులకు, గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లకు జీతాలు పెంచుతామని నితీష్‌కుమార్ హామీ ప్రకటించారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 1.20 లక్షలకు పైగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే.. అంగన్‌వాడీ వర్కర్స్ (సేవికా) ఇప్పుడు పొందుతున్న 7 వేల జీతాన్ని.. 9 వేలకు పెంచుతామని, హెల్పర్స్( సహాయకా) జీతం 4 వేల నుంచి, 4,500లకి పెంచుతామని ఆయన సోమవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ జీతాల పెంపు ఆయా విభాగాలకు ఆదేశాలు జారీ చేయబడ్డాయని నితీష్ తెలిపారు.

# ట్రంప్ పాదరసం లాంటి వాడు


**-ఎప్పుడు ఎలా మాట్లాడుతాడో చెప్పలేం**
**-ట్రాంప్ వ్యాఖ్యలపట్ల జాగ్రత్తగా ఉండాలి**
**-కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ సూచన**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ట్రంప్ పాదరస స్వభావం కలిగిన వ్యక్తి అని థరూర్ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభివర్ణించారు. అధ్యక్షుడు, ఆయన సిబ్బంది చేసిన అవమానాలు చాలా ఉన్నాయన్నారు. భారత్, అమెరికా సంబంధాలపై ట్రంప్ సానుకూలంగా మాట్లాడగానే ప్రధాని నరేంద్రమోదీ స్పందించ డంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని త్వరగా స్పందించినప్పటికీ, రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు చేయాల్సిన తీవ్రమైన మరమ్మతులు మిగిలే ఉన్నాయన్నారు. ట్రంప్ కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నామని తెలిపారు. భారతీయులు ఎదుర్కొన్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ట్రంప్ వల్ల కలిగిన బాధ, అవమానాన్ని త్వరగా మర్చిపోలేమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చాలా త్వరగా స్పందించారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం అనే ప్రాథమిక సంబంధం గురించి విదేశాంగ మంత్రి కూడా నొక్కి చెప్పారు. అది ఇప్పటికీ అలాగే ఉంది. అదే మనం ఇవ్వాల్సిన ముఖ్యమైన సందేశం. రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు కలిసి పరిష్కరించుకోవాల్సిన తీవ్రమైన అంశాలు కొన్ని ఉన్నాయని నేను భావిస్తున్నాను. ట్రంప్ కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నాను. భారతీయులు ఎదుర్కొన్న వాస్తవ పరిణామాలు చాలా ఉన్నాయి. కాబట్టి అంత త్వరగా క్షమించలేరు. ఆ పరిణామాలను అధిగమించాల్సి ఉందని థరూర్ మాట్లాడారు. ?భారత్ విషయంలో తప్పు చేశానని ట్రంప్‌నకు అర్థమైంది కాబట్టే స్వరం మార్చారని ఇండియా మాజీ దౌత్యవేత్త కేపీ ఫాబియన్ అన్నారు. దూకుడుగా ముందుకెళ్లి తప్పుచేసినట్లు ట్రంప్ గ్రహించారని పేర్కొన్నారు. రష్యా చమురుకొంటే 25 శాతం అదనపు సుంకం విధించడం ట్రంప్‌నకు ఆశించిన ఫలితం ఇవ్వలేదన్నారు. 'ట్రంప్ వ్యాఖ్యలకు తగినట్లు-గా ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. కానీ, దీనితోనే వివాదం ముగిసిపోయిందనే నిర్ధరణకు రాకూడదు. ఇండియా ఎప్పటికీ ఇండియాగానే ఉంటు-ంది. ఇండియా నాగరిక దేశం. భారత్ మరే ఇతర దేశాన్ని అనుసరించదు. ప్రతిఒక్క దేశంతో స్నేహ సంబంధాలు కోరుకుంటు-ంది. వ్యాపారం చేస్తుంది. కానీ, ఇతరుల ఆదేశాలకు తలొగ్గదు' అని ఫాబియన్ చెప్పారు.

# పేరు మార్చుకున్న ఓయో కంపెనీ..

**-ఐపీవో ముంగిట కీలక నిర్ణయం!**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓయో కంపెనీ కీలక నిర్ణయం తీసుకుంది. తమ మాతృ సంస్థ ఒరావెల్ స్టేస్ పేరును ప్రిజంగా మార్చుకుంది. కార్పొరేట్ గుర్తింపులో భాగంగా తమ కంపెనీ పేరును ప్రిజం లైఫ్ ( సంక్షిప్తంగా ప్రిజం)గా మార్చామని ఓయో షేర్ హోల్డర్లకు రాసిన లేఖలో బోర్డు చైర్మన్, వ్యవస్థాపకుడు రితేశ్ అగర్వాల్ ప్రకటించారు. కాగా, ఓయో పేరు మాత్రం బ్రాండ్‌గా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఐపీవోకు వెళ్లడానికి ముందు ఓయో మాతృసంస్థ తమ పేరును మార్చుకోవడం గమనార్హం.తమ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించిన వివిధ బ్రాండ్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో ప్రిజం ఒక గొడుగులా పనిచేస్తుందని రితేశ్ అగర్వాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. మేం సమర్థంగా పనిచేయడానికి, మేం ఎవరో స్పష్టంగా తెలియజేయడానికి ఇది సహాయపడుతుందని తెలిపారు. తమ విభిన్న బ్రాండ్లను ప్రిజం కలుపుతుందని ఆయన వివరించారు. కాగా, ఓయో గ్రూప్ పోర్ట్‌ఫోలియోలో ఓయో, మోటెల్ 6, టౌన్‌హౌస్, సండే, పాలెట్ వంటి బ్రాండ్లు ఉన్నాయి. వెకేషన్ హోమ్స్ విభాగంలో బెల్విల్లా, డాన్ సెంటర్, చెక్ మైగెస్ట్, స్టూడియో ప్రెస్టీజ్ వంటి వివిధ బ్రాండ్లు ఉన్నాయి. ఎక్స్‌టెండెడ్ స్టే విభాగంలో స్టూడియో 6ను నిర్వహిస్తోంది. అమెరికాలో జీ6 హాస్పిటాలిటీ నుంచి కొనుగోలు చేసింది. ఇవన్నీ కూడా ఇప్పుడు ప్రిజం గ్రూప్ కింద పనిచేయనున్నాయి.

**ప్రిజం పేరునే ఎందుకు పెట్టారు?**
ఐపీవోకు వెళ్లడానికి ముందు ఓయో మాతృసంస్థ ఒరావెల్ స్టేస్ పేరును మార్చాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కొత్త పేరును సూచించాలని ప్రపంచవ్యాప్తంగా ఒక పోటీని పెట్టింది. ఇందులో ఆరు వేలకుపైగా సూచనలు వచ్చాయి. వాటి మేరకు ప్రిజం పేరును ఎంపిక చేశారు. ఇక ఓయో కంపెనీని రితేశ్ అగర్వాల్ 2012లో స్థాపించారు. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 35 దేశాల్లో 100 మిలియన్లకు పైగా కస్టమర్లకు సేవలందిస్తోంది.

# ఉత్తర కశ్మీర్‌లో భారీగా గుర్తు తెలియని సమాధులు..

## 90 శాతం ఉగ్రవాదులవే




**శ్రీనగర్ సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్ముకశ్మీర్‌లోని ఉత్తర కశ్మీర్‌లో పెద్ద సంఖ్యలో గుర్తు తెలియని సామూహిక సమాధులున్నాయి. అయితే వీటిలో 90 శాతం ఉగ్రవాదుల సమాధులేనని తేలింది. కశ్మీర్‌కు చెందిన సేవ్ యూత్ సేవ్ ఫ్యూచర్ ఫౌండేషన్ అనే ఎన్జీవో సంస్థ ఈ సమాధులపై అధ్యయనం చేసింది. వజహత్ ఫరూక్ భట్ నేతృత్వంలోని బృందం ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా, కుప్వారా, బందిపోరా, మధ్య కశ్మీర్‌లోని గందర్‌బాల్ సరిహద్దు జిల్లాలలోని 373 స్మశాన వాటికలను భౌతికంగా పరిశీలించింది. ట్యాగింగ్, ఫొటోగ్రాఫిక్ డాక్యుమెంటేషన్, స్థానికుల సాక్ష్యాలు, అధికారిక రికార్డుల ఆధారంగా మొత్తం 4,056 సమాధులను గుర్తించారు. వీటిలో 90 శాతం విదేశీ, స్థానిక ఉగ్రవాదులకు చెందిన సమాధులేనని నిర్ధారించారు.కాగా, మొత్తం 4,056 సమాధుల్లో 2,493 సమాధులు (61.5 శాతం) తీవ్రవాద కార్యకలాపాల్లో మరణించిన విదేశీ ఉగ్రవాదులకు చెందినవిగా ఈ బృందం గుర్తించింది. 1,208 సమాధులు (29.8 శాతం) భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో మరణించిన కశ్మీర్‌కు చెందిన స్థానిక ఉగ్రవాదులకు చెందినవిగా స్థానికులు, వారి కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఇక్కడ కేవలం తొమ్మిది (0.2 శాతం) మాత్రమే పౌర సమాధులను కనుగొన్నారు. మరోవైపు 1947లో జరిగిన కశ్మీర్ యుద్ధంలో మరణించిన గిరిజన ఆక్రమణదారులకు చెందిన 70 సమాధులను కూడా ఈ అధ్యయన బృందం గుర్తించింది. ఈ ప్రాంతంలో సంఘర్షణకు సంబంధించిన ఖననాల చరిత్రను హైలైట్ చేసింది. 'సత్యాన్ని వెలికితీయడం: ఎ క్రిటికల్ స్టడీ ఆఫ్ అన్‌మార్క్డ్ అండ్ అన్‌ఐడెంటిఫైడ్ గ్రేవ్స్ ఇన్ కశ్మీర్ వ్యాలీ' అనే పేరుతో ఒక నివేదికను రూపొందించింది. కాగా, తమ అధ్యయన నివేదికను ప్రభుత్వ సంస్థలకు అందజేస్తామని వజహత్ ఫరూక్ భట్ తెలిపారు. ఉత్తర కశ్మీర్‌లోని గుర్తు తెలియని సామూహిక సమాధులపై ఉన్న ఆరోపణలు, భిన్న కథనాలు, అపోహలను తమ అధ్యయనం నివృత్తి చేస్తుందని అన్నారు. ప్రజల నిధులతో నిర్వహించే ఈ ఎన్జీవో సంస్థ 2018లో ఈ ప్రాజెక్టును ప్రారంభించి 2024లో ప్రాథమిక పనిని పూర్తి చేసిందని వివరించారు.

# భారత్‌పై ఆంక్షలు సరైన నిర్ణయమే



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రష్యా చమురు కొనుగోలు కారణం చూపి భారత్ సహా పలు దేశాలపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా సుంకాలు, ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తాజాగా స్పందించారు. ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించారు. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేసే భారత్ వంటి దేశాలపై ఆంక్షలు సరైన నిర్ణయమే అంటూ వ్యాఖ్యానించారు.అమెరికన్ మీడియా ఏబీసీతో జెలెన్స్కీ మాట్లాడుతూ.. భారత్ సహా రష్యాతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్న దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను సమర్థించారు. ఈ చర్యను సరైన నిర్ణయంగా అభివర్ణించారు. 'రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై సుంకాలు విధించాలన్న ఆలోచన సరైనదని నేను భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. ఇటీవలే టియాంజెన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ కలిసి వేదిక పంచుకోవడంపై విలేకరుల ప్రశ్నకు జెలెన్స్కీ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఉక్రెయిన్‌లో శాంతి తీసుకువచ్చేందుకు తాజాగా జరుగుతున్న అన్ని ప్రయత్నాలను తాము స్వాగతిస్తున్నామని భారత్ ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. సాధ్యమైనంత త్వరితంగా ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించాలని మానవాళి కోరుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కి ప్రధాని మోదీ తెలియచేశారు. ఇరు దేశాల మధ్య సంధికి భారత్ ప్రయత్నిస్తున్నప్పటికీ న్యూ ఢిల్లీపై జెలెన్స్కీ నుంచి ప్రతికూల ప్రకటన వెలువడటం గమనార్హం.

# క్యాన్సర్ వ్యాక్సిన్ సిద్ధం ..రష్యా



**మాస్కో సెప్టెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రష్యా కొత్తగా తయారుచేసిన క్యాన్సర్ వ్యాక్సిన్ ప్రి క్లినికల్ ట్రయల్స్‌లో అధిక ప్రభావం చూపించిందని, ఉపయోగానికి సిద్ధమైందని ఫెడరల్ మెడికల్ బయోలాజికల్ ఏజెన్సి అధిపతి వెరోనికా స్కోర్ట్సోవా తెలిపారు. ఈ వ్యాక్సిన్‌కు రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అనుమతి కోసం వేచిచూస్తోందన్నారు. వ్లాదివోస్తోక్‌లో జరిగిన ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, మూడేళ్ల ప్రిక్లినికల్ ట్రయల్స్‌లో వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలు చూపిందని తెలిపారు. ట్రయల్స్‌లో వ్యాక్సిన్ యొక్క భద్రతను నిరూపించాయి, దానిని పదేపదే వాడటంతో పాటు దాని అధిక సామర్థ్యాన్ని కూడా రుజువుచేశాయి. ఇది ట్యూమర్ పరిమాణం తగ్గడం, పెరుగుదల నెమ్మదించడంతో సంబంధం ఉంది," అని స్కోర్ట్సోవా అన్నారు. కొన్ని క్యాన్సర్లలో ఈ ప్రభావం 60-80% వరకు చేరిందని ఆమె తెలిపారు. వేసవి చివరిలో క్లినికల్ వాడుకకు అనుమతి పొందేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖకు సమర్పించాం. వ్యాక్సిన్ వాడుకకు సిద్ధంగా ఉంది, మేము అనుమతి కోసం వేచిచూస్తున్నాం." వ్యాక్సిన్ గమలేయా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ అండ్ మైక్రోబయాలజీ తయారు చేసింది. ఇదే ఇన్‌స్టిట్యూట్ రష్యా స్పుత్నిక్ కోవిడ్-19 వ్యాక్సిన్‌ను కూడా అభివృద్ధి చేసింది